1. స్థావర జంగమ జగమందున నీ శక్తి స్వరూపము ప్రతిఫలింపగ = భూ వలయాకాశంబుల మించుచు – భువన పాలనముజేసెటి ప్రభువా ॥నమో॥
2. ధరణీ మానవ విమోచనార్థము – కరుణను జీవము లొసగిన ప్రభువా = పరమ కృపాభరితా మృతసారా వరసజ్జన హృదయాబ్జ విహారా ॥నమో॥
3. సుందర మలయజ గంధ ధూపముల – చందముననుమా వినుతులు గొను మా = వందే దేవ దయాసందీప = వందే శుభదానంద స్వరూపా ॥నమో॥

– ఇ.జి. ఆనందము

## 89 యేసునకు వందనము

రా – శంకరాభరణము (చాయ: ఉదయించినాడు) తా – అట

వందనమయ్యా – యేసు నీకు – వందనమయ్యా – మా కోరిక – లందియ్య వయ్యా = వందనమయ్య నీ సుందర పాదార – విందములకు భక్తి – వినతులు గావింతు = సందియంబులులేని పరమానందమున నీయందు డెందము – పొందుపడఁ జేయవె యెహోవా – నందనా [1]పాపేంధనాగ్ని ॥వందనమయ్యా॥

1. నర దైవత్వములు – రెండుగూడి – పరిపూర్ణమైన – దేహాత్మలు – ధరియించి యందు – లేశంబయిన – దురితంబులేని – యవతారము – నెరవుగా దాల్చి = ధరణికి నేతెంచి [2]నిరయార్హులగు సర్వ – నరుల రక్షింప నీ కరుణా ప్రవాహము = విరివిగా పరుగెత్తఁ జేయుచు – విమలమగు నీ ప్రాణరక్తము – లరుదుగా సమర్పణము ,చేసియు – తిరిగి లేచితివో మహా ప్రభూ ॥వందనమయ్యా॥

2. నీ పుణ్యమందు – నమ్మికొనెడి – యే పాపియైన – తక్షణమున – శాపంబుఁ బాసి – [3]త్రాణగలిగి – నీ [4]సజ్జనుండు – కృపవానిని – కాపాడుచుండు = దీపించు భవ దీయ దివ్య వాగ్దత్తంబు – లాపత్పరంపరల కడ్డుపడుచు నుండి = నీ పయిందన భారమెల్లను – వోపి యోపికనుండ నేర్చిన – పాపిపుణ్యండగుచు నాత్మను – [5]భవ్య సుఖ [6]మఖిలంబుఁ బడయును ॥వందనమయ్యా॥

[1]పాపమనే కట్టెలకు నిప్పువంటివాడా. [2]నరపాత్రులు. [3]బలము. [4]సమీపము. [5]శుభమైన. [9]సకల



3. శమదమ ప్రేమ – కృపా వినయ – సద్గుణములనెడి – భూషణముల – నిమిడియున్నట్టి – తనువు దాల్చి – క్రమముగానందు – దైవత్వము – కనుపఱచినావు = విమలోపదేశముల్ వివిధంబుగా శిష్య – సముదయమునకు నుత్తముగా బోధించి – యమిత పాపహరంబునకు భువినవతరించిన మేను సిలువను – శ్రమను మృతికల్పించి మృత్యువుఁ – జంపి జీవించిన మహాత్మా ॥వందనమయ్యా॥

– పురుషోత్తము చౌధరి

## 90 యేసుక్రీస్తుకు స్తుతి

రా – బిలహరి (చాయ: యేసునాధ కథా) తా – త్రిపుట

క్రీస్తునాయక నీ దయాళిని – కీర్తనలుగా బాడుదున్ – [1]నేస్తులతోఁ దండ్రి దేవుని – నిత్యమును [2]గొండాడుదున్ ॥క్రీస్తు॥

1. సిలువ మోసిన నీ ప్రయాసను – జెప్పుటకు నోరాడదు = [3]అలుకునొందక స్వామి నీ [4]ది – వ్యాంఘ్రి చెంతను గూడుదు ॥క్రీస్తు॥
2. నిమిషమైన న్బాయకెదలో – నిన్ను నే స్మరియింతును = అమితమౌ దేవా [5]ను క్రోశము – హర్షముగ వర్ణింతును ॥క్రీస్తు॥
3. యేసుప్రభు నా కాలమంతయు – నేమఱక నీ నామము = దాసునిగ భజియంతు నిఁక నేఁ – దప్పకుండను నీమము ॥క్రీస్తు॥
4. చచ్చి నే నరుదెంచి మోక్షము – స్వామి నీ యుపకారముల్ = హెచ్చు ప్రేమను బాడుచుందును – యెప్పుడును [6]గైవారముల్ ॥క్రీస్తు॥
5. మలినమౌ నా నత్తి నాల్క స – మాధిలోఁ గృశియింపను = బలిమితోనేఁ బాడుచుందును – భక్తి [7]యుజ్వలింపను ॥క్రీస్తు॥
6. కన్ను మూతలుగాను నీ సము – ఖంబు కేను బిరాలను = తెన్ను తప్పకవత్తు శ్రీకర – దేవ నను నీవేలను ॥క్రీస్తు॥
7. ముగ్గురొకఁడై వెల్గుచుండెడి – మోక్షరాజ్య [8]గరిష్ఠుఁడా = యొగ్గుచేయక నన్నుఁ బ్రోవవే – యేసునాధ [9]మహేశుఁడా ॥క్రీస్తు॥
8. భూతలములో నీ సమానముఁ – బోల్చ నేదియుఁ గానము = దాతవై మము సలుపవే నీ – తండ్రికిని [10]సంధానము ॥క్రీస్తు॥

– మిక్కిలి నమూయేలు

[1]స్నేహితులతో. [2]స్తుతింతును. [3]భయము. [4]పరిశుద్ధపాపదము. [5]కనికరము [6]స్తోత్రములు [7]ప్రకాశింపను. [8]గొప్పవాడా. [9]గొప్పదేవుడా. [10]కూడిక.